# మినీకథ

ఆర్టీసీ బస్టాండు రకరకాల మనుష్యులతో కళకళలాడుతోంది. శాస్త్రి బస్సుకోసం అరగంటనుంచి ఎదురుచూస్తున్నాడు. ఈ జనమందరూ పని ఉండే ప్రయాణం చేస్తున్నారా అనిపిస్తుంది శాస్త్రికి—ఆలోచిస్తుంటే. మళ్ళీ తనే నవ్వుకుంటాడు తన ఆలోచనకి. ఇంతలో ఏదో బస్ వచ్చింది.ఆ బస్‌కోసమే తను ఎదురు చూస్తున్నాడు. "హమ్మయ్య" ఊపిరి పీల్చుకున్నాడు.

దిగేవాళ్ళందరూ దిగిపోయారు. ఎక్కడానికి తోసుకుంటున్నారు. తనకి లోపల కూర్చోడానికి సీటు ఎలాగా దొరకదు. చివరగా ఎక్కవచ్చు-అనుకొని నిలబడ్డాడు. ఎలాగ అయితేనేం అంతా ఎక్కారు. కండక్టరు తలుపు మూయబోతుంటే చేత్తో వారించి ఫుట్‌బోర్డుపై కాలువేసి తనే తలుపు మూయబోతుంటే ఎవరో ఒక ముసలాడు చెయ్యూపుతూ పరుగెత్తి రాసాగాడు. బస్సు బయలుదేరబోతోంది. ముసలాడి చెయ్యి పట్టుకొని పైకిలాగి డోరు గట్టిగా వేశాడు. బస్సు వేగం అందుకుంది. ఇంకా టిక్కెట్లిస్తూనే ఉన్నాడు కండక్టరు. రాజమండ్రికి టిక్కెట్టివ్వమని మూడు రూపాయలిచ్చాడు శాస్త్రి. టిక్కెట్ పంచ్ చేసి ఇచ్చాడు కండక్టర్. చేతిలోని టికట్ వంక చూశాడు. రెండూ ఎనభై ఐదు పైసలు. చిల్లర పదిహేను పైసలు ఇచ్చే ప్రయత్నం గానీ. ఉద్దేశ్యంగానీ కండక్టరులో కనబడలేదు. మౌనంగా ఊరుకున్నాడు. ఆఖరుగా ముసలాడు కండక్టరు చేతిలో చిల్లర పెట్టి ఏదో ఊరు పేరు చెప్పాడు. చిల్లరంతా లెక్కపెట్టి "ఇంకా పదిహేను పైసలు కావాలి. ఇయ్యి" అన్నాడు కండక్టరు. ముసలాడు "నా కాడ ఇంక లేవు బాబూ! టీ నీల్లకూడా పైసల్లేవు" అంటున్నాడు దీనంగా. "ఏయ్ ఇదేమన్నా నీ బాబుగారి బస్సనుకున్నావా? తియ్యి డబ్బుల్తియ్యి. లేకపోతే దిగిపో" అన్నాడు కండక్టరు కరకుగా. కరువు ప్రాంతంలో బీటలు వారిన భూమిలా ఉంది ముసలాడి ముఖం ముడతలతో. నిలబడి ఇదంతా చూస్తున్నారు కొందరు ప్రయాణీకులు. ముసలాడు బతిమాలుతున్నాడు. "నీ వేషాలు నా దగ్గర కాదు. డబ్బులు తియ్యి" అంటున్నాడు కండక్టరు. కొందరు ప్రయాణీకులు వేడుక చూస్తున్నారు తప్ప. ఆ పదిహేను పైసలు తానిస్తానని ఒక్కరూ అనలేదు. వారిలో కొందరికి పది పైసలు. పదిహేను పైసలు. ఐదు పైసలు కండక్టరు ఇవ్వవలసి ఉన్నాడు. అడగడానికి ప్రిస్టేజీ. ఈ ముసలాడికి సహాయం చేయడానికి ఏదో కాంప్లెక్సు అడ్డు. శాస్త్రికి ఈ తంతు చూస్తుంటే ఆ బస్సులో వాళందరిమీదా పీకల్లాకా కోపం వచ్చింది. కండక్టర్ స్టాప్ చెప్పాడు ముసలాడిని దింపేద్దామని. "ఒద్దు. బస్ పోనీయండి, ఆ చిల్లరనేనిస్తాను" అన్నాడు శాస్త్రి. కండక్టరు వింతగాచూశాడు. "నాకు మీరు చిల్లర పదిహేనుపైసలివ్వాలి. అవి తీసుకోండి" అన్నాడు గంభీరంగా. ఇందాకటి శాస్త్రి మొహంలోని కోపం కండక్టరు మొహంలో ప్రతిఫలించింది. సంతృప్తితో కూడిన చిరునవ్వు శాస్త్రిముఖంపై విరిసింది. ●




- ఎమ్. సంపత్ కుమార్

త్వరలో వారం వారం!!
భరాగో నవల
స్వర్ణరేఖ